





ప్రజాజ్యోతి
ఖమ్మం
శుక్రవారం 29-3-2024 పేజీలు : 6

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

**బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా**

**గంజాయి నియంత్రణకు విస్తృతమైన చర్యలు.**

**తొమ్మిది బైండోవర్ కేసులు నమోదు.**

**సిపి సునీల్ దత్**

**కారేపల్లి,మార్చి 28, ప్రజా జ్యోతి:** ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున శాంతి భద్రతల పరిరక్షణకై విస్తృతమైన చర్యలు చేపట్టామని ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్ అన్నారు. గురువారం సింగరేణి మండలం కారేపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల చెక్ పోస్ట్ ను పరిశీలించిన అనంతరం కారేపల్లి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ కు సంబంధించి కేసుల వివరాలు పరిశీలించి ఎస్సై రాజారామ్ ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపి విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి మండలంలో రౌడీ షీటర్లకు సంబంధించి 9 బైండోవర్ కేసులను నమోదు చేశామన్నారు. ఎన్నికలవేళ గ్రామాల్లో పూర్తిస్థాయిలో బెల్ట్ షాపుల నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో జరిగే ఆవాంఛనీయ సంఘటనలకు సంబంధించి పోలీసులకు సమాచారం చేరవేస్తే వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఇటీవల కాలంలో గంజాయి అక్రమ రవాణా నియంత్రించే క్రమంలో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు,రాజకీయ పార్టీలు పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు.

# పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి మార్చి 28 ప్రజాజ్యోతి** రానున్న లోక్ సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం నూతన కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో నిర్వహించిన ఎ.ఎల్.ఎమ్.టి. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకు గాను సీఈఓ కార్యాలయపు వెబ్ సైట్ నందు ఉన్న పోస్టల్ బ్యాలెట్ కు సంబందించిన వివరాలను ఎన్ఐసి ద్వారా పొందుపరిచి పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో ప్రతి జిల్లా అధికారి తమ కార్యాలయ సిబ్బందితో సహా తమ వివరాలను పొందుపరిచే బాధ్యత కార్యాలయ అధికారి, నోడల్ అధికారిదేనని కలెక్టర్ స్పష్టం చేసారు. మే 6వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు తీసుకుంటామన్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేశన్ సెంటర్లో ఓటింగ్ చేసే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఫెసిలిటేశన్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజురు చేయడం జరుగుతుందన్నారు. ఓటర్లను గుర్తించడం వారికి ఫారం 12 అందించి జిల్లాలో అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఖమ్మం, కొత్తగూడెం ఆర్.డి.ఓ లు గణేష్, మధు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ మండల ఎంఈఓను తక్షణమే సస్పెండ్ చేయాలి

## టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారావు



**తల్లాడ, మార్చి 28 (ప్రజాజ్యోతి న్యూస్):** విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధముగా వ్యవహరించిన తల్లాడ మండలం విద్యా శాఖ అధికారి (ఎంఈఓ) పై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోనీ సస్పెండ్ చేయాలని తెలంగాణా ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొరకొప్పు. రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్సూర్ తండా పాఠశాల ఆవరణంలో పంచాయతీ భవన నిర్మాణం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమని,ఒక ప్రభుత్వ మండల స్థాయి ఉద్యో గై వుండి, విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటం క్షమించరాని నేరమని అన్నారు. ప్రభుత్వ మండల స్థాయి విద్యాశాఖ అధికారై వుండి, జిల్లా విద్యాశాఖ అధికారులను, మండల స్థాయి అధికారులను తప్పు దోవ పట్టించే విధంగా ఈ చర్యలూ ఉన్నాయని తక్షణమే తల్లాడ మండల ఎం ఈ ఓ పై చర్యలు తీసుకొని, వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండల స్థాయి లో నిబంధనలకు విరుద్ధంగా నడిచే ప్రైవేట్ స్కూల్స్ పైన చర్య తీసుకోవాల్సిన ఈ మండల విద్యాశాఖ అధికారి ,మండలములో తనకు ఇష్టమైన కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కు మద్దతు పలకటం, వాటి అభివృద్ధికి పాటుపడటం సిగ్గుమాలిన చర్య ని ఇటువంటి ఎంఈఓలను ఉపేక్షించ కూడదని అన్నారు. రెండవ శనివారం, ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా మండలంలో కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కు మద్దతు పలుకుతూ , ప్రభుత్వ సెలవు దినాల్లో స్కూల్స్ నడిచినా కూడా వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో ఇట్టి ఎం ఈ ఓ కుటుంబ సభ్యురాలు తాను పనిచేసే స్కూలుకు ప్రతిరోజు ఆలస్యంగా వెళ్ళటం వల్ల అక్కడ పిల్లలకు చదువు పారంగా ఇబ్బంది వచ్చిందేమోనని ఆ గ్రామ పెద్దలు అడ్డగించి స్కూలు గేటుకు తాళం వేసిన సందర్భం కూడా ఉన్నదని అన్నారు. గతంలో ఎం.ఈ.ఓ స్థానిక బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేకి అనుకూలంగా వ్యవహరించిన సందర్భా లు ఉన్నాయని ,వివిధ ఉపాధ్యాయ సంఘాలను టీచర్స్ ను, ఆట్టి ఎమ్మెల్యేకి మద్దతుగా మార్చిన సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు.

# బాండ్ల నగదు చెల్లింపులో జాప్యమెందుకు..?

**- ఆర్టీసి కార్మికుల మనో భావాలతో ఆటాడుతున్న యాజమాన్యం**

**- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి అప్పారావు**

**ఖమ్మం మార్చి 28 ప్రజాజ్యోతి :** ఖమ్మం ఆర్టీసి యాజమాన్యం కార్మికుల పట్ల వివక్షా పూరిత ధోరణి అవలంభిస్తుందని బాండ్లకు సంబంధించిన నగదు చెల్లింపులో ఎందుకు జాప్యం జరుగుతుందని ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బాండ్ల చెల్లింపుకు సంబంధించి రూ. 281 కోట్లను విడుదల చేసి 40 రోజులు గడుస్తున్నా కార్మికులకు నగదు ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ అత్యవసర సమావేశం గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో జరిగింది. రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాటి అప్పారావు మాట్లాడుతూ బాండ్ల చెల్లింపు విషయంలో ప్రభుత్వ వైఖరికి భిన్నంగా ఆర్టీసి యాజమాన్య వైఖరి ఉందని కొంత భాగాన్ని సీనియార్టీ ప్రకారం చెల్లిస్తామని చెప్పినా ఒక్క పైసా కూడా చెల్లించలేదన్నారు. ఎందుకు చెల్లించడం లేదో యాజమాన్యం కార్మికులకు తెలియజేప్పాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. కార్మికుల మనోభావాలతో యాజమాన్యం ఆటలాడుతుందని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అప్పారావు పిలుపునిచ్చారు. యాజమాన్యం స్పందించక పోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. తొలిదశలో డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేస్తామని అప్పటికి యాజమాన్య వైఖరిలో మార్పు రాకపోతే ఆందోళన చెపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో అధ్యక్ష, కార్యదర్శులు డి. జగన్నాథం, వి. బుచ్చిబాబు, ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు గోపాలరావు, నాగులమీరా, రఘురాం, రాంబాబు, ఆర్. నాగేంద్రసింగ్, కె. నాగభూషణరావు, రాయప్ప, సుందరం, రమణారావు, మధు, పవన్, లాజర్, హరినాథ్ బాబు, రమాదేవి, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మహాసభలు

**-హాజరుకానున్న సిఎం, పలువురు రాష్ట్ర మంత్రులు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ**

**ఖమ్మం మార్చి 28 ప్రజాజ్యోతి**




టియుడబ్ల్యూజె (ఐజెయు) మూడవ తెలంగాణ రాష్ట్ర మహాసభలు మే నెల చివరి వారంలోఖమ్మంలో జరగనున్నట్లు టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ తెలిపారు. ఈ-మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావుతో పాటు రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలనేతలు, వివిధ వర్గాల ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్రమహాసభల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక సమావేశం గురువారం స్థానిక ప్రెస్ క్లబ్లో జరిగింది. జిల్లా అధ్యక్షులువనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ మహాసభలనిర్వహణకు సంబంధించి ఖమ్మంజిల్లాకు అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రమహాసభలు నిర్వహించడం ఖమ్మంలో ఇది మూడోసారి అని గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రెండు సార్లు మహాసభలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మహాసభల నిర్వహణను పురస్కరించుకుని ఏప్రిల్ మొదటి -వారంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నామని దీనికి రాష్ట్ర కమిటీ బాధ్యులు హాజరవుతారని తెలిపారు. -మహాసభలలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధన కోసం చర్చించడం జరుగుతుందని రాంనారాయణ తెలిపారు. ఖమ్మంజిల్లా ఎన్నో ప్రజా ఉద్యమాలతో పాటు చారిత్రక మహాసభలకు అతిథ్యమిచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు, జర్నలిస్టులు పూర్తి సహాయ సహకారాలను అందించి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కమిటీ బాధ్యులు ఎన్. వెంకట్రావు, ఖదీర్, టియుడబ్ల్యూజె (ఐజెయు) ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నాయకులు నలజాల వెంకట్రావు, శివానంద,ఎం.పాపారావు చెరుకుపల్లి శ్రీనివాస్, కూరాకుల గోపి, వై. మాధవరావు, ఎస్ కె -మోహి నుద్దీన్, తాళ్ళూరి మురళి, నామ పురుషోత్తం, జనార్ధనాచారి, మేడి రమేష్, భవాని సింగ్, ఆలస్యం అప్పారావు, -ఏలూరి వేణుగోపాల్, కళ్యాణ్, రవికుమార్, విజయ్ పాల్గొన్నారు.

# విలేకరిపై జరిగిన దాడికి యూనిటీ ఆఫ్ మాల ఖండన



**తిరుమలాయపాలెం, మార్చి 28, ప్రజాజ్యోతి :** ఆంధ్రప్రభ దినపత్రిక లో క్రైం రిపోర్టర్ గా పని చేస్తున్న నల్లి శ్యామ్ పై రౌడీ మూక చేసిన దాడిని ఖమ్మం జిల్లా కమిటీ, యూనిటీ ఆఫ్ మాల టూ టౌన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడి చేసిన నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బుధవారం రాత్రి నల్లి శ్యామ్ తన విధులను ముగించుకొని ధంసలాపురం లోని తన ఇంటికి వెళ్తున్న సమయంలో కారుతో ఢీ కొట్టి, కత్తులతో పొడవడానికి గద్దల ప్రవీణ్ మరో నలుగురు రౌడీ షీటర్లు ప్రయత్నించారని, శవాన్ని మాయం చేస్తామని బెదిరించారని కమిటీ తెలిపింది. ఈ విషయం పై శ్యామ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా. తక్షణమే స్పందించిన పోలీసులు రౌడీ మూకల కారును వెంబడించి పాలేరు సమీపంలో ఇద్దరూ రౌడీ మూకలను అదుపులోకి తీసుకున్నారని వారు తెలిపారు. బోగస్ రుణాల పై నిజాలు నిర్భయంగా రాసిన నల్లి శ్యాం పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పారిపోయిన మిగిలిన వారిని కూడా వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ దాడి సంఘటన పై జిల్లా అధ్యక్షులు కందుల ఉపేందర్, ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు, టూ టౌన్ యూనిటీ ఆఫ్ మాల కమిటీ అధ్యక్షుడు మోదుగు వేణు, ప్రధాన కార్యదర్శి జమ్మి వీరబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ తురక నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు చింతమాల సుందర్రావు శ్యామ్ పై జరిగిన దాడి సంఘటనపై తక్షణమే స్పందించి నిందితులను శిక్షించాలని ముఖ్య నాయకులు అందరు డిమాండ్ చేశారు.

## కమలాపురంలో ఘనంగా కాటమయ్య కళ్యాణం

**ముదిగొండ మార్చి 28(ప్రజాజ్యోతి)**



మండలపరిధిలో కమలాపురంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామి (కాటమయ్య) దేవాలయంలో సూరమాంబ కళ్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు, చిన్నారులు జల బిందెలతో ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకొని కాటమయ్యకు జలాభిషేకం చేశారు. అనంతరం గౌడ సంఘ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలు చెల్లించారు.

## ఖమ్మం బిజెపి అభ్యర్థికి టిడిపి మద్దతు

**ఖమ్మం ప్రతినిధి మార్చి 28 ప్రజా జ్యోతి**



బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావుకు ఖమ్మం జిల్లా తెలుగు దేశం పార్టీ బుధవారం నాడు సంపూర్ణ మద్దతు తెలిపింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తదితర సీనియర్ నేతలతో కలిసి వినోద్ రావు టీడీపీ కార్యాలయానికి మర్యాదపూర్వకంగా వెళ్లారు. టిడిపి జిల్లా కార్యదర్శి కేతినేని హరీష్ నేతృత్వంలోని బృందం మిత్రపక్షమైన బీజేపీ బృందానికి ఘన స్వాగతం పలికారు. ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షాలైన రెండు పార్టీల కార్యకర్తలు, నేతలు కలిసికట్టుగా పనిచేసి ఖమ్మంలో జయకేతనం ఎగురవేయాలని ఉభయ పార్టీల నేతలు నిశ్చయించారు. ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి తమ పూర్తి మద్దతు ఉంటుందని టీడీపీ నేతలు తెలిపారు.

## సాయి గణేష్ కుటుంబాన్ని పరామర్శించిన తాండ్ర వినోద రావు

**శ్రీ స్తంభాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ని దర్శించుకున్న బిజెపి అభ్యర్థి**

**సాయి గణేష్ కుటుంబాన్ని**

**- పరామర్శించిన తాండ్ర వినోద్ రావు**

**ఖమ్మం ప్రతినిధి మార్చి 28 ప్రజాజ్యోతి**



నాటి అధికార పక్షం రాజకీయ వేధింపులు భరించలేక 2022 ఏప్రిల్ లో ఆత్మహత్య చేసుకున్న బీజేపీ కార్యకర్త సామినేని సాయి గణేష్ (26) కుటుంబాన్ని పార్టీ ఖమ్మం లోక్ సభ నియోజకవర్గ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు బుధవారం పరామర్శించారు. స్తంభాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వర్ రావు తదితర నాయకులతో కలిసి వినోద్ రావు ఖమ్మం పట్టణంలోని జూబ్లీపురలో ఉన్న సాయి గణేష్ నివాసానికి వెళ్లి. వారి అమ్మమ్మ సావిత్రమ్మ ని కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు, ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఖమ్మం మున్సిపల్ పరిధిలోని 46వ డివిజన్ లో నివసించిన సాయి గణేష్ మీద పెట్టిన దొంగ కేసుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకోవడం, ఈ సంఘటనను సీరియస్ గా తీసుకున్న కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఫోన్ లో పరామర్శించడం తెలిసిందే. "కార్యకర్తలే మా బలగం. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. ప్రతి కార్యకర్తా మోడీ తో, అమిత్ షా తో, కిషన్ రెడ్డి తో సమానం అన్నారు. క్యాడర్ ను కంటికి రెప్పలా కాపాడుకుంటామని నేను భరోసా ఇస్తున్నా," అని వినోద్ రావు చెప్పారు. అంతకుముందు వినోద్ రావు, వారి కుమారుడు వినీత్ స్తంభాద్రి శ్రీ లక్ష్మీ నరసింహుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. వారికి వేద పండితులు ఆహ్వానం తెలిపి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 7 వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు దుద్దుకూరి వెంకటేశ్వర రావు, అసెంబ్లీ కన్వీనర్అల్లిక అంజయ్య, అనంత ఉపేందర్, తజనోత్ భద్రం, చావా కిరణ్, భూక్యా శ్యాం రాథోడ్ పాల్గొన్నారు.

# కావ్య హాస్పిటల్స్ ఖమ్మంలో అత్యాధునిక వైద్య సేవలు

ఖమ్మం మార్చి 28 ప్రజాజ్యోతి




ఖమ్మం కావ్య హాస్పిటల్స్ లో జనరల్ మెడిసిన్ , డయాబెటాలజీ , ఎండోక్రినాలజీ , క్రిటికల్ కేర్ వైద్య సేవలు - 24/7 వైద్య సేవలు ఉభయ ఖమ్మం జిల్లాలకు అత్యాధునిక వైద్యం తక్కువ ధరలకు అందిస్తోంది . వాటి తో పాతుగా కొత్తగ హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ నుండి వైద్యులు డా.వెంకటేష్ బొల్లినేని - వాస్కులర్ మరియు ఎండోవాస్కులర్ సర్జన్ ఖమ్మంలో నీ కావ్య హాస్పిటల్స్ లో ప్రతి 1వ మరియు 3వ మంగళవారం అందుబాటు లో ఉంటారు . హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ ప్రముఖ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజిస్ట్ డాక్టర్.సుభాకర్ నాదెళ్ల ప్రతి నెల 2వ బుధవారం కావ్య హాస్పిటల్స్ ఖమ్మంలో అందుబాటు లో ఉంటారు అని కావ్య హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్.కావ్యచంద్ యలమూడి, చైర్మెన్ రవీందర్ యలమూడి , ప్రసూన పారుపల్లి తెలిపారు.

## ఎస్ ఆర్ స్పోకెన్ ఇంగ్లీష్ అకాడమీ ఇనిస్టిట్యూట్ కార్యాలయాన్ని ప్రారంభించిను 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్

ఖమ్మం కార్పొరేషన్ మార్చి 28 ప్రజాజ్యోతి



ఖమ్మం నగరంలో 23వ డివిజన్ పరిధిలో మిషన్ హాస్పిటల్ ఎదురుగా ఎస్ ఆర్ స్పోకెన్ ఇంగ్లీష్ అకాడమీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఇన్స్టిట్యూట్ ను డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ గచేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది . తెలుగు ద్వారా ఇంగ్లీష్ చదవడం, వ్రాయడం, మాట్లాడటం, బేసిక్స్ నుండి నేర్పించ బడును అని, 8వ తరగతి నుండి ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ మరియు మ్యాథ్స్ , ఫిజిక్స్ క్లాసెస్ చెప్పబడును అని , అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఇంగ్లీష్ క్లాసెస్ (గ్రూప్స్, టెట్ , డి.ఎస్.సి ) , 9 నుండి 15 సంవత్సరాల పిల్లలకు సమ్మర్ స్పెషల్ క్లాసెస్ లో భాగంగా మెమోరీ టెక్నిక్స్ , స్పీడ్ రీడింగ్ టెక్నిక్స్ , మ్యాథ్స్ క్లాసెస్ నిర్వహించబడును అని ఇన్స్టిట్యూట్ మేనేజ్ మెంట్ నిర్వకులు కొలనుపాక శ్రీనివాసరావు (ఎం.ఏ, ఎం.ఇడి), కొలనుపాక రమాదేవి మరియు డైరెక్టర్ కొత్తపల్లి సంధ్యారాణి ఎం.ఏ (ఇంగ్లీష్ లైటరేచర్) తెలిపారు. కావున ప్రతి ఒక్క విద్యార్థి, విద్యార్థిని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాథ్స్ ట్యూటర్ బి.రమాదేవి, జీ.వి.వి.ఎల్ నర్సింహా రావు, బండారు శ్రీనివాసరావు , తిరుమల శెట్టి జయ ప్రకాష్ , పరమేశ్వర రావు, బబ్బులు, లాలా, అక్బర్, ఉమ్మనేని రాంబాబు, దాసరి నాగేశ్వరరావు, దాసరి శివ,మురళి, తాజుద్దిన్ పాల్గొన్నారు.

# వల్లభిలో పోలీసులు వాహనాలు తనిఖీ

ముదిగొండ మార్చి 28(ప్రజా జ్యోతి)

తెలంగాణ,ఆంధ్ర సరిహద్దు అయిన మండలపరిధిలో వల్లభి చెక్ పోస్ట్ వద్ద ఎస్సై గజ్జెల నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయం విధితమే.ఎన్నికల కోడ్ ఉల్లంఘించినచో కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి నరేష్ హెచ్చరించారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ ఒకటిలోగా ప్రారంభించాలి

**జిల్లా కలెక్టర్ వి పి గౌతం నీటి గౌతం**



ఖమ్మం ప్రతినిధి మార్చి 28 ప్రజాజ్యోతి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 1 లోగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో రబీ ధాన్య సేకరణ కార్యాచరణ పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా 151 ధాన్య కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు,ఇట్టి కేంద్రాలు ఏప్రిల్ 1 నుండి అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. జిల్లాలో రబీలో 171357 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్ కు రానున్నట్లు అంచనా వుందని అన్నారు. ఐకెపి ద్వారా 28, పిఏసిఎస్ ద్వారా 96, డిసిఎంఎస్ ద్వారా 27 ధాన్య కొనుగోలు కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. గన్ని బ్యాగులు, తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లినర్లు కేంద్రాలకు అందజేయాలన్నారు. కేంద్రాల బాధ్యులకు శిక్షణ నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతున్న కేంద్రాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సెక్టార్ల వారిగా ధాన్య రవాణాకు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను సిద్ధం చేయాలన్నారు. మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, సంబంధిత వారితో సమావేశాలు చేపట్టాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీడ, త్రాగునీరు తదితర మౌళిక సదుపాయాల కల్పన చేయాలన్నారు. ఎఫ్ఏక్యూ ప్రకారం తేమ శాతం వుండేలా, తాల్ లేకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చి, కనీస మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, డిఆర్డీఓ సన్యాసయ్య, ఆర్డీవో ఆఫ్రీన్, డిఎం మార్కుఫెడ్ సునీత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రంను ప్రారంభించిన ఖమ్మం నగర అధ్యక్షుడు పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్

**ఖమ్మం అర్బన్ మార్చి 28 ప్రజాజ్యోతి**



వేసవి కాలం దృష్ట్యా ప్రజల దాహర్తిని తీర్చేందుకు తారకరామ ఆటో నగర్ ఆధ్వర్యంలో ఖమ్మం ఎఫ్సిఐ రోడ్ వద్ద నూతనం గా ఏర్పాటు చేసిన చలివే వెంద్రాన్ని ఖమ్మం నగర అధ్యక్షుడు పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం లో ఇలాంటి చలివెంద్రాలను ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం తారకరామా ఆటో నగర్ సొసైటీ వారు ఏర్పాటు చేసిన ఈ చలివెంద్రాల వల్ల ప్రజలు దాహర్తి ని కొంత వరకు తీర్చుకోవచ్చు.. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని చలివెంద్రాలను ఏర్పాటు చేయవలసింది గా ప్రముఖులకు,కాంగ్రెస్ నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నాం అని అన్నారు..ఈ కార్యక్రమం లో %ాదీజ% నగర కాంగ్రెస్ చైర్మన్ బాణాల లక్ష్మణ్,తారకరామా ఆటోనగర్ అధ్యక్షులు రవి, సొసైటీ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జునరావు, గంట భీమయ్య, గంగారపు శ్రీనివాసరావు, బెజ్జంకి రాములు, మాజీ కౌన్సెలర్ సింగం అంజయ్య, నగర %ాజ% సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్,27వ డివిజన్ అధ్యక్షులు కేశబోయిన శ్రీశైలం,షేక్ రజ,48వ డివిజన్ అధ్యక్షులు భోజెడ్లసత్యనారాయణ, రవీంద్ర, జాకీర్ తాళ్లూరి సాయి కిరణ్,మరియు ఆటోనగర్ బాధ్యులు, వారితో పాటు కాంగ్రెస్ నగర నాయకులు ఎమ్మె రామకృష్ణ, 46వ డివిజన్ %ాదీజ% అధ్యక్షులు తుపాకుల మధు, దయ్యాలా నాగేశ్వరావు, బండ రవి, మేకల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రభ విలేకరిపై జరిగిన దాడికి టియు డబ్ల్యూ జే (ఐజేయు) ఖండన



ఖమ్మం మార్చి 28 ప్రజా జ్యోతి.

ఆంధ్రప్రభ దినపత్రిక లో క్రైం రిపోర్టర్ గా పని చేస్తున్న" నల్లి శ్యామ్" పై రౌడీ మూక చేసిన దాడిని టియుడబ్ల్యూజే ఐజేయు ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. గురువారం ప్రెస్ క్లబ్ లో జరిగిన అత్యవసర సమావేశం ఈ దాడిని తీవ్రంగా ఖండించి నిందితులపై చట్టరీత్యా కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది . బుధవారం రాత్రి నల్లి శ్యామ్ తన విధులను ముగించుకొని ధంసలాపురం లోని తన ఇంటికి వెళ్తున్న సమయంలో కారుతో ఢీ కొట్టి,కత్తులతో పొడవడానికి గద్దల ప్రవీణ్ మరో నలుగురు రౌడీ షీటర్లు ప్రయత్నించారని,శవాన్ని మాయం చేస్తామని బెదిరించారని కమిటీ తెలిపింది.ఈ విషయం పై శ్యామ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా. తక్షణమే స్పందించిన పోలీసులు రౌడీ మూకల కారును వెంబడించి పాలేరు సమీపంలో ఇద్దరూ రౌడీ మూకలను అదుపులోకి తీసుకున్నారని వారు తెలిపారు . బోగస్ రుణాల పై నిజాలు నిర్భయంగా రాసిన నల్లి శ్యాం పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పారిపోయిన మిగిలిన వారిని కూడా వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ దాడి సంఘటనపై టి యు డబ్ల్యూ జే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రాంనారాయణ గారు మల్టీ జోన్ ఐజి రంగనాథ్ గారితో ఫోన్ లో మాట్లాడి శ్యాం పై జరిగిన దాడి సంఘటనపై తక్షణమే స్పందించి నిందితులను శిక్షించాలని కోరారు టి యు డబ్ల్యూ జే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ జరిగిన అత్యవసర సమావేశంలో యూనియన్ ముఖ్య, రాష్ట్ర , జిల్లా నేతలు, ఎలక్ట్రానిక్ మీడియా ముఖ్య నాయకులు అందరూ పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో మతోన్మాద శక్తులను ఓడించాలి

## ఆవుల అశోక్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు




**కారేపల్లి, మార్చ్ 28, ప్రజా జ్యోతి:**
దేశం ప్రశాంతంగా ఉండాలన్న కార్పొరేట్ దోపిడీని అడ్డుకోవాలన్న ప్రజలకు కనీస ప్రజాస్వామ్యమైన దక్కాలంటే ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికలో బిజెపిని తిరిగి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ అన్నారు. గురువారం సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి లో జరిగిన మండల స్థాయి ముఖ్య కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ 400 సీట్లు గెలిపిస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామని నిసిగ్గుగా మోడీ ప్రకటిస్తున్న వైనాన్ని దేశ ప్రజలు పరిశీలించాలని ఆయన కోరారు .మన ధర్మాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్ పద్ధతులుప్రవేశపెట్టాలని బిజెపి ప్రయత్నిస్తుందని, నల్ల డబ్బు బయటికి తీసుకొస్తానన్న మోడీ తీసుకురాక పోగా అధికారంలోకి వచ్చాక అవినీతిని చట్టబద్ధత కల్పించి ఎలక్ట్రో బాండ్ల రూపంలో వేలకోట్లు కార్పొరేట్ వ్యక్తుల దగ్గర నుంచి దండుకున్నారని ఆయన అన్నారు . ఆకలి సూచికలు దేశం 120 స్థానంలో ఉందని హ్యాపీ ఇండిపెండెన్స్ లో కూడా 125 స్థానంలో దేశం ఉందని ఇంత దరిద్రమైన పాలన అందిస్తున్న మోడీ సిగ్గు పడకు పోగా విశ్వగురు అని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశభక్తి ప్రజాతంత్ర వామపక్ష విప్లవ పార్టీలన్నీ పాసిస్ట్ బిజెపి ను ఓడించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి ఎన్ వి రాకేష్, మండల నాయకులు ధరావత్ సక్రు, పులకాని సత్తిరెడ్డి, వడ్డే వెంకటేశ్వర్లు, బాలు, బిక్కసాని భాస్కర్, రావుల నాగేశ్వరరావు, రంగ్యా, చల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి : జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్



**ఖమ్మం ప్రతినిధి మార్చి 28 ప్రజాజ్యోతి**
ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. గురువారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భూ రక్షణా బృందాలతో ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల గుర్తింపు చేసి, అట్టి జాబితాను తగుచర్యల నిమిత్తం భూ రక్షణా బృందాలకు అందజేసినట్లు, వాటిపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. సమీక్షలో స్థలాల వారిగా అధికారులు చేపట్టిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఖాళీ స్థలాల్లో క్రమబద్ధీకరణ జీవో 59 లో చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురయిన చోట వెంటనే స్థలాలు స్వాధీనం చేసుకొని, ఫెన్సింగ్, సిసి కెమెరాల ఏర్పాటుచేసి, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బృందాలు క్షేత్ర పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. బృందాలు క్రియాశీలకంగా పనిచేయాలని, ప్రతి ప్రభుత్వ స్థలం పరిరక్షణ చేయాలని అన్నారు. వైఎస్సార్ కాలనిలో ఎక్స్ సర్వీస్ మెన్ లకు కేటాయించిన అసైన్డ్ భూమిపై సర్వే చేసి సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. ఎన్ని ప్లాట్లు ఉన్నవి, ఎన్ని ప్లాట్లలో నిర్మాణాలు ఉన్నవి, ఎన్ని ఖాళీ ప్లాట్లు ఉన్నది తనిఖీలు చేయాలన్నారు. ప్లాట్ల విషయమై ఆధారాలకు నోటీసులు ఇవ్వాలన్నారు. పువ్వాడ ఉదయ్ నగర్ లో ఖాళీ ప్లాట్ల విషయమై చర్యలు చేపట్టాలన్నారు. టేకులపల్లి డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో లబ్ధిదారులు నివాసం లేని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న నిర్మాణాలు గుర్తించి తొలగించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఉన్న అసైన్డ్ చేసిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న అర్బన్ తహసిల్దార్ సిహెచ్ స్వామి

ఖమ్మం అర్బన్ మార్చి 28 ప్రజాజ్యోతి
అసైన్డ్ చేసిన స్థలం నిరుపయోగంగా ఉండడంతో తిరిగి స్వాధీనం చేసుకుంటున్నట్లు ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సిహెచ్. స్వామి తెలిపారు. 1997, 2005 సంవత్సరాల్లో ఖానాపురం, వైఎస్సార్ కాలనీ, సర్వే నెంబర్ 37 లో స్వాతంత్ర్య సమరయోధులకు ఒక్కొక్కరికి 144 చదరపు గజాల చొప్పున 439 మందికి ప్రభుత్వ స్థలాన్ని అసైన్డ్ చేయడం జరిగిందని ఆయన అన్నారు. అట్టి స్థలంలో అసైన్డ్ చేసిన వారు వుండకపోవడం, కొందరు అట్టి స్థలాలను మరొకరికి అమ్ముకోవడం జరిగినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని ఏ ఉద్దేశ్యం కోసం ప్రభుత్వం ఇచ్చిందో, దాని ప్రకారం ఇండ్లు కట్టుకొని నివాసం ఉండాలి కానీ, ఇతరులకు అమ్ముకోవడానికి వీలులేదని ఆయన అన్నారు. దాదాపు 25 సంవత్సరాలుగా అసైన్డ్ చేసిన స్థలాలు నిరుపయోగంగా ఉండడంతో అట్టి స్థలాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవడానికి చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం రెవిన్యూ, మునిసిపల్, పోలీసు అధికారులు అట్టి స్థలాల్లో ఉన్న 20 బేస్మెంట్లు, 20 షెడ్లను తొలగించి, ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. ఇట్టి స్థలాలపై అభ్యంతరాలు ఉన్నవారు, తమ వద్ద నున్న ఒరిజినల్ పట్టాలతో ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ ని సంప్రదించాలని ఆయన అన్నారు.



# కాంగ్రెస్ లో భారీ చేరికలు



**కారేపల్లి, మార్చి 28, ప్రజాజ్యోతి**
విశాల సహకార పరపతి సంఘం డైరెక్టర్లలో ఒకరైన గిద్దె వారి గూడెంకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్, సొసైటీ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బానోత్ రామ్మూర్తి నాయక్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వైరా లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ఉపేందర్ కు కాంగ్రెస్ కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మాణిక్యారం ( గుడి తండా) కు చెందిన బిఆర్ఎస్ నాయకుడు ధారావత్ బద్దూలాల్ కు, గుంపెల్ల గూడెం గ్రామానికి చెందిన బానోతు వీరన్న (చక్రం)కు కూడా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని,కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని అన్నారు.పార్టీ సిద్ధాంతాలు నచ్చి ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త, నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, కల్తి భద్రం, కల్తి అరుణ్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,తదితరులు, పాల్గొన్నారు.

## కారేపల్లిలో ముమ్మరంగా రోడ్ల నిర్మాణం

**ఇమ్మడి తిరుపతిరావు.**

**కారేపల్లి, మార్చ్ 28, ప్రజాజ్యోతి:**



సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి గ్రామంలో ముమ్మరంగా సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని గురువారం కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు అన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ద్వారా వచ్చిన ఈ. జీ.యస్ నిధులతో చేపట్టిన %ఎ ఎ% రోడ్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద వేస్తున్న %ఎ ఎ% రోడ్డు వల్ల బొడ్రాయి అడుగుమట్టం క్రిందికి కావడం తో గ్రామ పెద్దల సూచనమేరకు బొడ్రాయి చుట్టూ %ఎ ఎ% వేయించడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కేవలం మూడు నెలల సమయం లోనే ఇంత పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం జరగడం సంతోషం గా ఉందని ఆయన సంతోషం వ్యక్తపరిచారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు తొగర శ్రీను, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిరాగ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**ఎస్ఐ బాదావత్ రవి**

ప్రజా జ్యోతి-ఏన్కూరు



చిరాగ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఏన్కూర్ ఎస్సై బాదావత్ రవి అన్నారు. మండల పరిధిలోని కొత్త మేడిపల్లి గ్రామంలో గల ఆదివాసి కుటుంబాలకు చిరాగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు లక్ష 30 వేల విలువగల 70 సోలార్ లైట్లు ఎస్ఐ బాదావత్ రవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరాగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే సేవలు గురించి తెలుసుకొని అమెరికా చెందిన అఖిల్ బామ్నాని అనే విద్యార్థి ఫౌండేషన్ ద్వారా సోలార్ లైట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ ఫౌండేషన్ గత 21 సంవత్సరాలుగా నడిపిస్తున్నట్లు తెలిపారు. భారతదేశానికి చెందిన యువకుడు అమెరికాలో చదువుకుంటూ పార్ట్ టైం ఉద్యోగం చేసుకుంటూ ఆదివాసి కుటుంబాలకు,నీరు పేదవారికి సాయం చేయడం అభినందనీయమన్నారు.

## 10 సెల్ ఫోన్ లను బాధితులకు అప్పగించిన తల్లాడ ఎస్సై కొండల్ రావు



తల్లాడ, మార్చి 28 (ప్రజా జ్యోతి న్యూస్): ప్రతిఒక్కరూ మొబైల్ ఫోన్లను భద్రంగా దాచుకోవాలని, జనాలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని తల్లాడ ఎస్సై బి. కొండలరావు సూచించారు. ఇటీవల సెల్ ఫోను పోగొట్టుకున్న తల్లాడ మండ లం అన్నారుగూడెం గ్రామానికి చెందిన దాసరి జానకి అనే మహిళకు గురువారం ఆయన సెల్ ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బస్టాండ్ ల్లో, ఇతర రద్దీగా ఉన్న ప్రదేశాల్లో అపరిచితులు సెల్ ఫోన్లు దొంగలించడం లేక జారిపడటం జరుగుతుందని, ఎవరైనా సెల్ ఫోన్లు పోతే పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలన్నారు. అలా అందించిన వెంటనే తాము దాన్ని ట్రేస్ అవుట్ చేసి బాధితులకు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 10 సెల్ ఫోన్లు పట్టుకొని బాధితులకు అందించినట్లు తెలిపారు. సెల్ ఫోన్ వ్యక్తులు కూడా అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే స్టేషన్ కు సమాచారం అందించాలన్నారు.

## వెంకటాపురంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి

**కన్నులపండువగా సీతారామ లక్ష్మణ రామాలయ, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు**



తల్లాడ, మార్చి 28 (ప్రజాజ్యోతి న్యూస్): తల్లాడ మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామలక్ష్మణ రామాలయం, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం కన్నుల పండువగ నిర్వహించారు. వీటితోపాటు ముత్యాలమ్మ తల్లి, అంకమ్మ తల్లి దేవాలయాల ప్రతిష్టలను చేశారు. వేలాదిమంది భక్తుల నడుమ, అర్చకులు, పూజారులు, వేద పండితుల సాక్షిగా దేవాలయాలతో పాటు ధ్వజస్తంభాను ప్రతిష్టించారు. సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఏరువా గోపాలరావు ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. వేలాది మంది భక్తులు హాజరు కావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ ఆడపడుచులు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పోలేపల్లి కోటేశ్వరరావు, నాగళ్ళ వెంకటేశ్వరరావు, ఏరువా కృష్ణయ్య, నెలవెల్లి వెంకటేశ్వరరావు, ఉప్పేర్ల భద్రయ్య, మోత్కూరు మల్లాచారి, రాయల వెంకటేశ్వరరావు, చావా నారాయణ, డాక్టర్ కాపా మురళీకృష్ణ, గుర్రం శ్రీనివాసరావు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు..

## పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**సత్తుపల్లి,మార్చి 29:(ప్రజాజ్యోతి)** సత్తుపల్లి పట్టణ పరిధిలో చౌదరి హోటల్ రోడ్ లో జమాధి ఇస్లామి హింద్ సత్తుపల్లి శాఖ వారి ఆధ్వర్యంలో రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా సత్తుపల్లిలో సుమారు మూడు వందల మంది పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిధిగా పాల్గొని ముస్లిం కుటుంబ సోదర,సోదరిమనులకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జమాధి ఇస్లామి హింద్ సత్తుపల్లి శాఖ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, జమాధి ఇస్లామి హింద్ కమిటీ, ముస్లిం మహిళా కమిటీ



పాల్గొన్నారు.

# రైతును రాజు చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- **గతంలో రైతుల చేతులకు బేడీలు వేసి జైలుపాలు చేసింది బీఆర్ఎస్**
- **జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు సాగర్ నీటి నిల్వలు తెలియకుండా మాట్లాడుతున్నారు**
- **సాక్షాత్ కేసీఆర్ ప్రకటించిన నష్టపరిహారానికి దిక్కులేదు**
- **బీఆర్ఎస్ రైతుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది - మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు**



**బోనకల్,మార్చి 28,(ప్రజాజ్యోతి:** బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి పంటలు ఎండిపోయి రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుంటే ఐదేళ్లుగా జిల్లా పరిషత్ చైర్మన్ పదవిలో ఉండి ఏనాడు మండల కేంద్రంలో పంట నష్టపోయిన రైతులను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పరిశీలన చేయలేదని కానీ నేడు ఆయన ఎండిపోతున్న పంటలు పరిశీలించడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు.గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పై తీవ్రంగా మండిపడ్డారు.సాక్షాత్తు ఒకప్పటి మాజీ సీఎం ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ బోనకల్ మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించి వెళ్లి ఎకరాకు 10000 నష్టపరిహారం అందిస్తానని రైతులను బీఆర్ఎస్ మోసం చేసింది నిజం కాదా అన ప్రశ్నించారు.మీరు అన్నట్లుగా మండలంలో మొక్క జొన్న నష్టపోయిన రైతులకు ఎకరాకు పదివేలు అందించినట్లు మీరు నిరూపిస్తామంటే బహిరంగంగా దాన్ని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాలు విసిరారు.వర్షాలు లేక సాగర్ నీటి సామర్థ్యం తగ్గిపోయిన విషయం రాష్ట్రవ్యాప్తంగా తెలిసిందే,కానీ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క పనితీరు చూసి వారికి పుట్టగతులు ఉండవని తెలిసే అనవసర మాటలు మాట్లాడుతున్నారన్నారు.వ్యవసాయశాఖ అధికారులు రైతులకు మినుము,పెసర లాంటి పంటలు వేసుకోవాలని సూచించిన కొంతమంది రైతులు వారికి ఉన్న బావులు బోర్లతో మొక్కజొన్నను సాగు చేసుకున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలు చేస్తామన్నట్లుగానే,మొదటి 100 రోజుల్లోనే ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల రూపాయలు, మహిళలకు మహాలక్ష్మి ద్వారా ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 రూపాయలకే గ్యాస్ సిలెండర్,ఇందిరమ్మఇండ్లు,రైతు భరోసా లాంటి వాటిని ఇప్పటికే ప్రజలకు అందజేశామని అన్నారు. ఎర్రుపాలెం,మధిర మండలాలకు సాగర్ నీటి కొరత లేకుండా మల్లు భట్టి విక్రమార్క కృషితోనే రెండవ జోన్ లోకి ఆ రెండు మండలాలను తీసుకురావడం జరిగింది అన్నారు.అందుకు గాను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 800 కోట్ల రూపాయల నిధులు కేటాయించిన విషయం గుర్తు చేశారు.అప్పుడు ఇప్పుడు రైతును రాజు చేసేది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమేనని కీర్తించారు. మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మండలం ప్రగతి బాటలో నడిపేందుకు పక్క ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు.పార్లమెంట్ ఎలక్షన్ అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోతుందని అన్నారు. ఆల్రెడీ రాష్ట్రంలో టిఆర్ఎస్ ను ప్రజలు తరిమికొట్టారని పేరు మార్చుకొన్న బీఆర్ఎస్ కు కూడా అదే గతి పడుతుందని అన్నారు.ఎలక్షన్ కోడ్ అనంతరం ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## చెక్ పోస్ట్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్



**కారేపల్లి, మార్చ్ 28, ప్రజాజ్యోతి:** ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గురువారం ఖమ్మం రూరల్ డివిజన్ పరిధిలోని కారేపల్లి క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను పోలీస్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో మోహరించిన కేంద్ర పోలీసు బలగాలతో పాటు స్థానిక పోలీసులు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా సరిహద్దులో పటిష్టమైన చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, జిల్లాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని, నగరం నుంచి వెళ్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సరైన ఆధారాలు చూపించకుండా తరలించే నగదు,నగలు, ఇతరత్రా సొత్తును సీజ్ చేసి, సంబంధిత అధికారులకు అప్పగిస్తారని తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ. 50 వేలకు మించి నగదు తీసుకువెళ్లరాదని, పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు ఉంటే తప్పనిసరిగా వెంట సంబంధిత పత్రాలు ఉండాలని సూచించారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్టి, 15 ఎస్ఎస్టి, 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 %×7 గట్టి నిఘా ఉంచామని తెలిపారు. తనిఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని సూచించారు.